ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు

- వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల
- 12, 20వ వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం



22వ వార్డులో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న పీతల గోవింద్



లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల



12వ వార్డు జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు

ఏయూ క్యాంపస్: పాలకులే సేవకులుగా మారి నేడు సంక్షేమ పథకాలు, సేవలు ప్రజలకు చేరువవుతున్నాయని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అన్నారు. సోమవారం 20వ వార్డు పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 672 మంది లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ ప్రజల వద్దకే సేవలు అందించడంలో మరో అడుగు ముందుకు వేస్తూ జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్న విధానం తెలుసుకోవడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్పొరేటర్ ముర్వల లక్ష్మి మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల దరఖాస్తులను పరిశీలించి, వెంటనే ధ్రువ పత్రాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ జె.విజయలక్ష్మి, వార్డు స్పెషల్ ఆఫీసర్ వై.వి.శివకుమార్, ఏపీడీ దుర్గాప్రసాద్, వార్డు సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు ముర్వల సురేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్ రత్న పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

ఆరిలోవ: కుల, మతాలకు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం సామాజిక భవనంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. జెడ్సీ కనకమహాలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ రోహిణితో కలసి విజయనిర్మల పలువురు లబ్ధిదారులకు వివిధ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అందజేస్తున్నారన్నారు. వార్డులో 7 సచివాలయాల్లో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి 1500 మందికి అవసరమైన కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ తదితర ధ్రువ పత్రాల కోసం దరఖాస్తులు చేయించారు. వారిలో అర్హులు, వారి ఆధారాలను బట్టి 1200 మందికి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'సురక్ష'లో 392 మందికి ధ్రువీకరణ పత్రాలు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 392 మందికి పలు ధ్రువీకరణ పత్రాలను పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ అందజేశారు. రెండు సచివాలయాల పరిధిలో 419 మంది దరఖాస్తు చేసుకోగా.. 392 మందికి పలు ధ్రువ పత్రాలు అందించారు. ఈ కారక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేష్, సచివాలయం కన్వీనర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు..



కుల ధ్రువీకరణ పత్రం కోసం వారం క్రితం సచివాలయానికి వెళితే అక్కడ సిబ్బంది వలంటీరే మీ ఇంటికి వచ్చి దరఖాస్తు చేయిస్తారని చెప్పారు. ఆ ప్రకారం వలంటీరు మా ఇంటికి వచ్చి నాతో దరఖాస్తు చేయించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఈ రోజు ధ్రువ పత్రం అందుకున్నాను. చాలా ఆనందమేసింది. ఇలాంటి సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.
– ఎన్.సత్యనారాయణ, ఆరిలోవ, 12వ వార్డు

దరఖాస్తు చేయగానే కుల ధ్రువీకరణ పత్రం



కుల ధ్రువీకరణ పత్రం కోసం గతంలో పలు మార్లు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదు. ఇప్పుడు తాజాగా దరఖాస్తు చేయడం, వెంటనే పరిశీలించి కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారు.
– కాగితాల అప్పలకొండ, పెదవాల్తేరు

మనవరాలికి సర్టిఫికెట్ వచ్చింది..



మా మనవరాలికి కుల ధ్రువీకరణ పత్రం కోసం గతంలో ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగాం. ఈ రోజు మా వలంటీర్ సాయంతో వెంటనే సర్టిఫికెట్ వచ్చింది. ఎవ్వరికీ రూపాయి కూడా లంచం ఇవ్వకుండా పిలిచి ధ్రువీకరణ పత్రం అందజేశారు.
– షేక్ నజీం, పెదవాల్తేరు

పిల్లల జనన ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నా..



మా పిల్లలకు సంబంధించిన జనన ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేశాం. ఈ రోజు జగనన్న సురక్ష కార్యక్రమంలో పిలిచి సర్టిఫికెట్లు అందజేశారు. కుల, ఆదాయ, కుటుంబ సభ్యులు, వివాహ, మరణ, తదితర ధ్రువీకరణ పత్రాల కోసం తిరగకుండా ప్రజలకు అందించడం చాలా బాగుంది.
– రామ్ ప్రసాద్, పెదవాల్తేరు

2 రోజుల్లో కుల ధ్రువపత్రం ఇచ్చారు..



నాకు కుల ధ్రువీకరణ పత్రం అవసరమైంది. ఇందు కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాను. అక్కడ అడిగితే సచివాలంలో దరఖాస్తు చేయాలని చెప్పారు. రెండు రోజుల క్రితం మా వలంటీరు వచ్చి ఏమైనా సర్టిఫికెట్ అవసరముందా? అని అడిగారు. కేస్ట్ సర్టిఫికెట్ కావాలని చెప్పాను. వలంటీరు నాతో దరఖాస్తు చేయించి ఇప్పుడు సర్టిఫికెట్ ఇచ్చారు.
– జి.వెంకటాచారి, చినగదిలి, 12వ వార్డు

క్లుప్తంగా

పోలమాంబ ఆలయంలో శ్రావణ మాస పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు ఆలయంలో ఈ పూజలు చేయనున్నారు. వచ్చేనెల 18, 25, సెప్టెంబర్ 1, 8, 15 తేదీలలో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. వచ్చేనెల 31న గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన చేయనున్నారు. అమ్మవారికి నెల పూజకు రూ.350 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరిపించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆఖరు రోజున అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో నిర్వహించే చండీ హోమంలో భక్తులు రూ.1500 చెల్లించి స్వయంగా పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

బడ్డీల తొలగింపు



చినగదిలి కూడలి వద్ద బడ్డీలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

ఆరిలోవ: రోడ్డులో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన బడ్డీలు, తోపుడు బళ్లను జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. బీఆర్‌టీఎస్‌లో చినగదిలి కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు ఇటీవల కొత్తగా నిర్మించిన రోడ్డు పక్కన కొందరు బడ్డీలు, తోపుడు బళ్లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటిపై ఫిర్యాదులు అందడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు ఆదేశాలతో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఝాన్సీ ఆధ్వర్యంలో స్క్వాడ్ సిబ్బంది రమేష్ తదితరులు సోమవారం వాటిని తొలగించారు. కొందరు స్థానిక నాయకులు ఈ తొలగింపును అడ్డుకోవడానికి ప్రయత్నించినా సిబ్బంది తమ పని చేసుకుపోయారు.

సింహగిరి కాలనీలో అంధకారం



చీకటిమయంగా ఉన్న సింహగిరి కాలనీ

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు కొండవాలు ప్రాంతం సింహగిరి కాలనీ, ప్రశాంతినగర్‌లో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. కొన్ని నెలలుగా ఇక్కడ వీధి దీపాలు వెలగకపోవడంతో అంధకారం నెలకొంది. సింహగిరి కాలనీలో 91/బి/3/2 విద్యుత్ స్తంభం నుంచి వరసుగా వీధుల్లో 32 స్తంభాలకు దీపాలు వెలగడంలేదు. దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా సచివాలయం సిబ్బంది, విద్యుత్ విభాగం సిబ్బంది పట్టించుకోవడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండవాలు కావడంతో రాత్రివేళ చీకటిలో పాములు వీధుల్లోకి చేరుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

30న సంగీత కళాకారుల సంఘ ఎన్నికలు

మద్దిలపాలెం: విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘం కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నామన్నారు. ఎన్నికల్లో అన్ని అంశాలలో సేవలందిస్తున్న కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81796 05267 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ప్లాస్టిక్ భూతంపై వీధి నాటిక



ప్లాస్టిక్ భూతంపై వీధి నాటిక ప్రదర్శిస్తున్న కళాకారులు

మద్దిలపాలెం: పర్యావరణానికి హానికరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను ప్రథమ స్థానంలో నిలపాలని కోరుతూ సోమవారం పిఠాపురం కాలనీలోని వారపు సంత, మద్దిలపాలెంలో బస్టాండ్‌లో వీధి నాటికను ప్రదర్శించారు. జీవీఎంసీ సౌజన్యంతో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంఘం సభ్యులు నాటిక ప్రదర్శనలు ఇస్తున్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి మేలు అంటూ కథాంశంగా ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో విశాఖ నగరం ప్రథమ స్థానం సాధించడానికి ప్రతి ఒక్కరూ ఓటింగ్‌లో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. దండు నాగేశ్వరరావు రచించిన ఈ నాటికకు రసజ్ఞ త్రినాథరావు దర్శకత్వం వహించారు.

'ప్రధాని మోదీ దృష్టికి శిష్టకరణాల సమస్యలు'



చంద్రబోష్‌కు వినతి పత్రం అందిస్తున్న అనూష పట్నాయక్

బీచ్ రోడ్డు: ప్రధాని మోదీ దృష్టికి శిష్టకరణాల సమస్యలు తీసుకెళ్తానని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోష్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయనను రాష్ట్ర శిష్టకరణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనూష పట్నాయక్ కాకినాడలోని ఇంటికి వెళ్లి కలిసి వినతి పత్రం అందజేశారు. శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చే అంశంపై రాజ్యసభలో చర్చించడంతో పాటు ప్రధానికి లేఖ కూడా రాస్తానని చంద్రబోష్ హామీ ఇచ్చినట్లు అనూష తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ శిష్టకరణ సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర బెనర్జీ, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఎస్.కె.మహంతి, జయింతి శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కట్టడికి జీవీఎంసీ కృషి



బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి వస్తున్న మేయర్ హరివెంకటకుమారి



సైకిల్‌పై కార్యాలయానికి వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజారవాణా వ్యవస్థను ఉపయోగించి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై చేరుకుని, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌లు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు. కాలుష్యం కట్టడికి జీవీఎంసీ విశేషంగా కృషి చేస్తోందన్నారు.

200 మందికి దంత వైద్య పరీక్షలు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత డిగ్రీ కళాశాలలో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. గీతం దంత వైద్యశాఖ సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించినట్లు కళాశాల అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా 200 మంది కళాశాల విద్యార్థులు పరీక్షలు చేయించుకొని మందులు స్వీకరించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి రోజు దంతాలను క్రమం తప్పకుండా శుభ్రం చేసుకోవాలని, ఎలాంటి లోపాలు ఉన్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, డాక్టర్ నవీన్, డాక్టర్ రాజేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఏఈఎంఎస్ ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్

మహారాణిపేట: సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్(ఏఈఎంఎస్) ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్ కోరారు. సోమవారం రేసపువానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో జరిగిన 108 అధికారుల జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంబులెన్స్ నిర్వహణలో పలు మెళకువలు నేర్పారు. జోనల్ మేనేజర్ గణేష్, జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, జిల్లా మేనేజర్ త్రినాథ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్ పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకుంటూ.. ముందుకు సాగుతూ..

- 17వ వార్డులో ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం
- హాజరైన వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న అక్కరమాని విజయనిర్మల, తదితరులు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్పొరేటర్ గేదెల లావణ్య ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ముఖ్యఅతిథిగా పాల్గొని స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ, ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యా, వైద్యం, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు చెబుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సచివాలయాల వారీగా ఆయా సమస్యలను పరిష్కరించే దిశగా ఇప్పటికే అనేక వార్డుల్లో పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పార్టీ నాయకులు నీలారెడ్డి, పిల్లా సత్యవతి, కార్యకర్తలు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఆర్టీఈ సీట్లు బహిర్గతం చేయాలి



పాఠశాల యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడుతున్న సీతారాం

ఎంవీపీ కాలనీ: ఉచిత విద్యా నిర్బంధ హక్కు చట్టం (2009)ని అనుసరించి రాష్ట్రం ప్రభుత్వం ఆదేశాల మేరకు కేటాయించిన సీట్లను ఆయా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు బహిర్గతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. సోమవారం ఆయన ఎంవీపీ కాలనీలోని పలు ప్రైవేట్ పాఠశాలలను సందర్శించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి విద్యా విహార్, క్వీన్సీ పాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో ఈ ఏడాది ఆర్టీఈ సీట్లు వివరాలు లేకపోవడంపై ప్రశ్నించారు. ప్రిన్సిపాళ్లు కౌసల్య, భాస్కరిల సమక్షంలో ఆయా వివరాలను నోటీసు బోర్డుల్లో సిబ్బందితో అతికింపజేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టి ఈ చట్టాన్ని అమలు చేస్తున్నాయన్నారు. కరోనాతో మరణించిన తల్లిదండ్రుల పిల్లలకు, బడుగు, బలహీన వర్గాల వారి పిల్లలకు ఈ చట్టం ద్వారా సీట్లు కల్పించడం అద్భుత అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి శ్రీలత, విద్యాశాఖ అధికారులు, సంక్షేమ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం



చిన్నారుల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో తీరాన్ని ఆనుకుని ఉన్న లాసన్స్‌బే కాలనీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వేస్టు టు వండర్స్ పేరిట పార్కులో ఆధునికీకరించిన పలు క్రీడా ప్రాంగణాలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే క్రమంలో పార్కులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆలోచనల్లో భాగంగా వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచే విధంగా పార్కును తీర్చిదిద్దామన్నారు. ప్రారంభం అనంతరం ఆయా క్రీడా, ఆహ్లాదకరమైన సముదాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్పొరేటర్ నూకరత్నం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణపై ప్రత్యేక దృష్టి



బాలుడిని పరామర్శించి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయిస్తున్న సిటీ వెటర్నరీ డాక్టర్



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల నివారణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు వెటర్నరీ విభాగపు అధికారి డాక్టర్ కిషోర్ నేతృత్వంలో సిబ్బంది రంగంలోకి దిగారు. 95వ వార్డు పోర్లుపాలెంలో కుక్క దాడిలో గాయపడిన చీపురుపల్లి రుత్విక్ అనే బాలుడిని పరామర్శించి, యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆ వార్డులో సుమారు 25 వీధి కుక్కలను పట్టుకొని ఆపరేషన్ కోసం పంపించినట్టు వెటర్నరీ డాక్టర్ కిషోర్ తెలిపారు. మేయర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సుమారు 100 వీధి కుక్కలకు ఇసుకతోట, గోపాలపట్నం, గాంధీగ్రామం, నరవ, చినగదిలి, జడ్జికోర్టు సమీపాన గల వెటర్నరీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు.

'రాళ్లబెల్లా' స్కూల్‌పై చర్యలకు డిమాండ్

డాబాగార్డెన్స్: ఎంవీపీ కాలనీలో ఉన్న రాళ్లబెల్లా ఇంటర్నేషనల్ స్కూల్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ స్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో విద్యార్థి తండ్రి పేర్ల నారాయణరావు మాట్లాడుతూ అడ్మిషన్ల విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చారని, పిల్లల భవిష్యత్‌తో స్కూల్ యాజమాన్యం ఆడుకుంటోందని ఆరోపించారు. రాళ్లబెల్లా ఇంటర్నేషనల్ స్కూల్‌కు సెకండరీ స్టేట్ బోర్డ్ గుర్తింపు లేదని, సీబీఎస్‌సీ అనుబంధం కూడా లేదన్నారు. ఆ స్కూల్ గుర్తింపు 2020–21 విద్యా సంవత్సరంతో ముగిసిందని, ఆ తర్వాత గుర్తింపు రెన్యువల్ కాకపోయినప్పటికీ పాఠశాలను కొనసాగిస్తున్నారని చెప్పారు. 2016–17 నుంచి 2020–21 వరకు 7వ తరగతి వరకు మాత్రమే సెకండరీ స్టేట్ బోర్డు అనుమతి పొందిందన్నారు. కానీ 10వ తరగతి వరకు ప్రవేశాలు కల్పించారని వారు విమర్శించారు. పాఠశాలను మూసివేయాలని నోటీసులు వచ్చాయని, కానీ తల్లిదండ్రులకు నోటీసులు అందలేదన్నారు. ఈ విషయమై గత నెల 26న జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినా, ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ నెల 4న ఎంవీపీ పోలీసులను ఆశ్రయించామని, అలాగే విద్యా శాఖ అధికారి కార్యాలయ దృష్టికి తీసుకెళ్లినట్టు వారు చెప్పారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య



స్వప్న(ఫైల్)

ఆరిలోవ: ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలానికి చెందిన శెట్టి స్వప్న(22) దీన్‌దయాల్‌పురం ప్రాంతం సిద్ధార్థ నగర్‌లో అద్దింట్లో ఉంటోంది. ఆమె నగరంలోని ఓ బ్యూటీపార్లర్‌లో పనిచేస్తుంది. సోమవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. స్థానికులు ద్వారా సమాచారం తెలుసుకొన్న ఆరిలోవ ఎస్ఐ అప్పారావు సిబ్బందితో వెళ్లి ఆమె మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. డుంబ్రిగుడలో ఉన్న ఆమె తల్లిదండ్రులు మంగళవారం రానున్నారు. వారు వచ్చిన తర్వాత ఆమె ఆత్మహత్యకు గల పూర్తి కారణాలు తెలుస్తాయని సీఐ తెలిపారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: అదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అతి తక్కువ వేతనాలు ఇస్తున్న తమను ఆదుకోవాలని 14 రోజులుగా ఆందోళన చేస్తున్నామని సంఘాల నాయకులు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం గంగవరం, దిబ్బపాలెం మత్స్యకార గ్రామాల్లోని ఇళ్లు, భూములను ఇచ్చామని, ఏళ్లు గడుస్తున్న వేతనాలు పెంచలేదని నాయకులు వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డి.అప్పారావు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా అప్పారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లన్న, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.